సాక్షి ఖమ్మం

బుధవారం । 8 । అక్టోబర్ । 2025



కళ్ల ముందే సాగరతీరం!

భద్రాద్రి జిల్లా పగిడేరులో సహజసిద్ధంగా ఉబికి వస్తున్న వేడినీటి ఆధారంగా కృత్రిమ బీచ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. 8లో



'వసతి'కి తాళం

గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో సిబ్బంది సమ్మెతో సెలవులు ముగిసినా పూర్తిస్థాయిలో తెరుచుకోలేదు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. మధ్యాహ్నం ఎండ గరిష్ట స్థాయిలో నమోదవుతుంది.

పొత్తు పొడిచేనా?!

స్థానిక సంస్థల ఎన్నికల రణరంగాన్ని ఎదుర్కొనేందుకు పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీల్లో అంతర్గతంగా చర్చిస్తుండగా పొత్తుల అంశం తెరపైకి వస్తోంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎక్కడెక్కడ పొత్తు పెట్టుకోవాలి.. పొత్తుతో ఎంత మేర లాభం.. ఒంటరిగా వెళ్తే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్, వామపక్షాలు పొత్తు కుదుర్చుకుంటాయా లేక బీఆర్ఎస్‌తో సీపీఎంకు అవగాహన కుదురుతుందా అన్న అంశంపై చర్చ జోరందుకుంది. అయితే నోటిఫికేషన్ వెలువడ్డాకే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పొత్తులపై అవగాహన కుదిరే అవకాశముందని సమాచారం. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

స్థానిక ఎన్నికల్లో పోటీపై పార్టీల్లో చర్చలు

- జట్టుగానా.. ఒంటరిగా పోటీ చేయాలా అని మీమాంస
- పరిస్థితులు అనుకూలించకపోతే పరస్పర అవగాహన
- కొన్ని చోట్ల ఆశావహుల నుంచి వ్యతిరేకత



గత పరిస్థితుల ఆధారంగా..

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగానే పార్టీలు అభ్యర్థులను బరిలో నిలిపాయి. అంతకుముందు 2018 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, టీజేఎస్ ప్రజాకూటమిగా ఏర్పడ్డాయి. కానీ ఆతర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాకూటమి ప్రభావం చూపలేదు. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో గెలుపొందిన టీడీపీ.. స్థానిక సంస్థల మాత్రం కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరగడంతో కొన్నిచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య అవగాహన కుదిరింది. ఇక జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ కలిసి పోటీ చేస్తాయని ప్రచారం జరిగినా ఒంటరిగానే బరిలోకి దిగాయి. కొందరు అభ్యర్థుల మధ్య స్థానికంగా అవగాహనతో జెడ్పీటీసీ ఎన్నికల్లో ఒకరికి, ఎంపీటీసీ ఎన్నికల్లో మరొకరికి మద్దతు ఇచ్చారు.

కాంగ్రెస్‌లో భారీగా పోటీ

జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డుసభ్యులుగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ ఉంది. ఇతర పార్టీలతో పోలిస్తే ఎన్నికల అంశం ఎప్పుడు తెరపైకి వచ్చినా కాంగ్రెస్‌లోని ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఒక్కో జెడ్పీటీసీ స్థానంలో ముగ్గురు నుంచి పది మంది వరకు టికెట్లు ఆశిస్తున్నారు. ఎంపీటీసీ స్థానాల్లో పోటీ కొంత తక్కువగా ఉన్నా.. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో మాత్రం పోటీ ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం, జిల్లాలో బలమైన కేడర్ కలిగి ఉన్న నేపథ్యాన పొత్తులకు విముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ పొత్తు అంటూ కుదిరితే సీపీఐతోనే ఉండొచ్చన్న ప్రచారం జరుగుతోంది.

బీఆర్ఎస్‌కు ప్రతిష్టాత్మకం

2014 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు జిల్లాలో ఆశించిన ఫలితాలు రాలేదు. ఆతర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం మెరుగైన స్థానాలు దక్కాయి. గత జెడ్పీటీసీ ఎన్నికల్లో 20 స్థానాలకు బీఆర్ఎస్ 17 స్థానాల్లో గెలవగా, 583 గ్రామపంచాయతీల్లో 351 స్థానాలు బీఆర్ఎస్ మద్దతుదారులు గెలుచుకున్నారు. అదే మాదిరి ఈసారి కూడా మంచి ఫలితాలు రాబట్టేలా బీఆర్ఎస్ వ్యూహరచన చేస్తోంది. అయితే, గతంలో మాదిరి బీఆర్ఎస్‌కు స్థానికంగా అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయా అన్న మీమాంస వెంటాడుతోంది. ఈ నేపథ్యాన పొత్తులతో బరిలో దిగితే ఫలితాలు ఎలా ఉంటాయనే అంశంపై పార్టీలో చర్చ జరిగే అవకాశముంది. కలిసి వచ్చే పార్టీలతో పొత్తు కుదుర్చుకోవడమే మంచిదనే భావనతో ఉన్నట్లు సమాచారం. అత్యధిక జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పార్టీ వ్యూహాలను సిద్ధం చేస్తుండగా.. బుధవారం ఖమ్మంలో జరిగే జిల్లా స్థాయి సమావేశంలో ఎన్నికల కార్యాచరణపై చర్చించనున్నారు.

లెఫ్ట్.. ఎటు రైట్?

సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, న్యూడెమోక్రసీ పార్టీలు ఈ ఎన్నికల్లో ఎటు వైపు వెళ్తాయన్నది రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటివరకు ఎవరికి వారు తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని ప్రకటిస్తున్నా చివరకు ఎవరితో జత కడతారనే చర్చ జరుగుతోంది. గత ఎన్నికల్లో పరిస్థితులను బేరీజు వేసుకుని ఈ ఎన్నికల్లో స్థానికంగా బలోపేతం కావాలన్న వ్యూహరచనలో లెఫ్ట్ పార్టీలు ఉన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో.. వామపక్షాల్లో ఏ పార్టీలు కలుస్తాయో నోటిఫికేషన్ వెలువడ్డాక తేలనుంది. అయితే గతంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీల్లో ప్రభావం చూపిన ప్రాంతాలపై వామపక్ష పార్టీలు దృష్టి సారిస్తున్నాయి.

వ్యూహాత్మక పొత్తులకే ఓటు

గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతుండడంతో ఇక్కడ స్థానిక పరిస్థితుల ఆధారంగా పొత్తులు కుదురుతాయి. ఈసారి అన్ని పార్టీలు జెడ్పీటీసీ ఎన్నికలనే ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. జెడ్పీ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఉండడంతో కొన్ని స్థానాల్లో వ్యూహాత్మకంగా పొత్తులకు వెళ్లే అవకాశముంది. ఏదైనా రెండు పార్టీల మధ్య అవగాహన ఉంటే అవసరాల మేరకు జెడ్పీటీసీ స్థానాల్లో పొత్తు కుదుర్చుకుని, జీపీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మద్దతు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకునే అవకాశముందని తెలుస్తోంది. అయితే, నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ల దాఖలు ప్రారంభమైతే తప్ప పొత్తులపై స్పష్టత వచ్చే అవకాశం లేదనే చెప్పాలి.

న్యూస్‌రీల్

ఆదర్శంగా మహనీయుల జీవితాలు

- వాల్మీకి జయంతిలో కలెక్టర్ అనుదీప్



వాల్మీకి చిత్రపటం వద్ద కలెక్టర్, అధికారులు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మహనీయుల జీవితాలను ప్రతీఒక్కరు ఆదర్శంగా తీసుకుని వారి బాటలో నడవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పూలమాల వేసి నివాళులర్పించాక మాట్లాడారు. రామాయణం రచనతోవెలుగొందిన వాల్మీకి ఆదర్శ మానవులకు ఉండాల్సిన లక్షణాలను బోధించారని తెలిపారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, శాఖ ఉద్యోగులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మిర్చి యార్డులోనే ఇకపై కొనుగోళ్లు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి యార్డులో ప్రస్తుతం మిర్చి కొనుగోళ్లు జరుగుతుండగా, మిర్చి యార్డుకే మారుస్తూ మార్కెట్ కమిటీ నిర్ణయించింది. పత్తి విక్రయాలు పెరిగిన నేపథ్యాన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ మంగళవారం సమావేశమై ఏసీ మిర్చి నమూనాల పరిశీలనకు తిరిగి మిర్చి యార్డునే వినియోగించాలని నిర్ణయించారు. అలాగే, నాన్ ఏసీ మిర్చి కొనుగోళ్లకు పత్తి యార్డులోని 7, 8వ షెడ్లను కేటాయించగా, లాట్ ఐడీల జారీ ఫైర్ స్టేషన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యాపారులు ఈ మార్పును గమనించాలని సూచించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నిరసనలో పాల్గొన్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్.గవాయ్‌పై సోమవారం జరిగిన దాడిని నిరసిస్తూ ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. అలాగే, నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన తెలపగా బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో న్యాయవాద సంఘాల బాధ్యులు మాట్లాడారు. సీజేఐపై జరిగిన దాడిని భారత న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. అత్యున్నత న్యాయస్థానంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తొండపు వెంకటేశ్వరరావు, గద్దల దిలీప్‌తో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి సన్నిధిలో చండీహోమం

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీ హోమం నిర్వహించారు. తొలుత మేళతాళాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారిని ఊరేగింపుగా తీసుకెళ్లగా, మండపారాధన, గణపతి పూజ అనంతరం చండీహోమం చేశారు. ఈ పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆతర్వాత శివాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు.

పర్మిట్లలో లోపాలపై అధ్యయనం

- కలప అక్రమ రవాణాపై సీసీఎఫ్ సమీక్ష
- అటవీ ఉద్యోగుల విధులు, చెక్‌పోస్టుల నిర్వహణపై ఆరా



వెలుగుమట్ల పార్క్‌లో చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్

ఖమ్మంవ్యవసాయం: ఇటీవల వెలుగుచూసిన కలప అక్రమ రవాణా వ్యవహారాన్ని అటవీ శాఖ తీవ్రంగా పరిగణించి లోతైన దర్యాప్తు చేస్తోంది. ఈ వ్యవహారం పలు రాష్ట్రాలతో ముడిపడి ఉండగా జాతీయ స్థాయి సమస్యగా పరిగణిస్తున్నారు. నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ల(ఎన్‌టీపీసీ) జారీలో ఉన్న లొసుగుల ఆధారంగా అనుమతి ఉన్న కలప మాటున విలువైన కలపను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ఇటీవల బయటపడింది. ఈ అంశంపై జిల్లా అధికారులు ఇప్పటికే విచారణ పూర్తిచేయగా, భద్రాద్రి జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్) భీమానాయక్ మంగళవారం ఖమ్మం వచ్చారు.

మరింత నిఘా

ఖమ్మం అటవీ కార్యాలయంలో అధికారులతో సమీక్షించిన సీసీఎఫ్.. నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ సిస్టంను అక్రమార్కులు ఎలా వినియోగించుకున్నారు. తప్పుడు పత్రాలు సృష్టించడానికి ఎంచుకున్న మార్గాలపై చర్చించారు. అలాగే, అటవీ ఉద్యోగుల విధులు, చెక్‌పోస్టుల నిర్వహణపైనా ఆరా తీశారు. తప్పుడు పర్మిట్లతో సర్కారు తుమ్మ కలప మాటున సండ్ర కలపను మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హరియాణా, గుజరాత్‌కు తరలించిన అంశంపై వివరాలు తెలుసుకున్నారు. వాస్తవంగా చింతకాని అటవీ సెక్షన్‌లో సండ్ర కలప లేకున్నా ఇతర జిల్లాల నుంచి సేకరించి ఇక్కడ పర్మిట్ ఆధారంగా తరలించారని, ఇందుకోసం అక్రమార్కులు ఎన్‌టీపీసీ లోపాలను ఆధారంగా చేసుకున్నట్లు అధికారులు సీసీఎఫ్‌కు వివరించారు. ఇప్పటికే చింతకాని బీట్ ఆఫీసర్ శ్రీకాంత్‌పై చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈక్రమాన సూర్యాపేటకు చెందిన స్మగ్లర్ వ్యవహారంపై కూడా చర్చించిన అధికారులు మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాల రిజర్వ్ ఫారెస్టు నుంచి సండ్ర కలపను అక్రమంగా రవాణా చేయకుండా నిఘా ముమ్మరం చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అలాగే, స్మగ్లర్లతో సంబంధాలు ఉన్న ఉద్యోగుల వివరాలు సేకరించాలని సీసీఎఫ్ ఆదేశించారు. ఇదే సమయాన పర్మిట్లలో లోపాలు, ట్యాంపరింగ్‌కు ఉన్న అవకాశాలపై చర్చించి సాంకేతిక బృందానికి నివేదిక ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. కాగా, జిల్లా పర్యటనలో భాగంగా సీసీఎఫ్ భీమానాయక్ ఖమ్మం వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో అభివృద్ధి పనులను పరిశీలించి డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్‌తో చర్చించారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు

కారేపల్లి: వరుస వర్షాలతో పత్తి నల్లబారుతున్నందున తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. కారేపల్లి మండలం మాణిక్యారంలో మంగళవారం పర్యటించిన ఆయన పలువురి పత్తి చేన్లను పరిశీలించి సూచనలు చేశారు. పంట నష్టంపై ఏఈఓలతో సర్వే చేయిస్తున్నట్లు తెలిపారు. ఏఓ భట్టు అశోక్‌కుమార్, ఏఈఓలు నరేష్, మహేష్, మున్ని, చంద్రకళ, ప్రమీల పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ఖమ్మం అభివృద్ధి

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పక్కన కమిషనర్ అభిషేక్ తదితరులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా కృషి చేస్తూనే అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రణాళికలు అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం 46వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేసిన ఆయన మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. రాజకీయ వేధింపులు, అక్రమ కేసులు లేకుండా పాలన సాగుతోందని తెలిపారు. రహదారుల విస్తరణకు ప్రజలు సహకరిస్తేనే ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని చెప్పారు. ఖమ్మంను చూసి ఇతర ప్రాంతాలు అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. పేదల సొంతింటి కల నిజం చేసేలా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. కాగా, ఖమ్మం అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా ఎన్ని నిధులైనా తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి, కమర్తపు మురళి, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణతో పాటు బాణాల లక్ష్మణరావు, ప్రసన్న కుమార్, సాధు రమేష్‌రెడ్డి, బాలగంగాధర్ తిలక్, తుపాకుల యలగొండస్వామి పాల్గొన్నారు.

■ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన 18వ డివిజన్ ముస్తఫానగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు.

నిషేధ చట్టం కట్టుదిట్టంగా అమలు

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన న్యాయమూర్తి చంద్రశేఖర్‌రావు, సీపీ సునీల్‌దత్

ఖమ్మంవైద్యవిభాగం: గర్భధారణకు ముందు, గర్భధారణ సమయాన రోగనిర్ధారణ పద్ధతుల నిషేధ చట్టం కట్టుదిట్టంగా అమలయ్యేలా అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన గర్భస్థపూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలిటీ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లలో చికిత్సకు అయ్యే ఫీజు వివరాలతో బోర్డులు ఏర్పాటుచేయించాలని తెలిపారు. అలాగే, లింగ నిర్ధారణ చట్టం నిషేధంపై అందరికీ అవగాహన కలిగేలా వివరించాలని సూచించారు. పిల్లలు అవసరం లేదని వదిలించుకునే క్రమంలో చంపకుండా దత్తతకు ఉన్న అవకాశాలపై విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో వేయిమంది మగ పిల్లలకు 946 మంది ఆడపిల్లలే జన్మిస్తున్నందున లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన, చేయించుకున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ నిందితులకు శిక్షపడేలా అవసరమైన ఆధారాలు సేకరించాలని సూచించగా, చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని సీపీ సునీల్‌దత్ తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి, జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, టి.విష్ణువందన, వివిధ శాఖల అధికారులు, సంస్థల బాధ్యులు చందు నాయక్, సి.బిందుశ్రీ, డి.రామారావు, పి.వెంకటరమణ, ఎం.నరేందర్, టి.శంకర్, రెహానా బేగం, ఎస్.మంగళ, జి.అపర్ణ, కుముదిని పాల్గొన్నారు.

27,427

ఓటరు గుర్తింపు కార్డులు



శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రెయినర్

ఖమ్మం సహకారనగర్: జిల్లా నుంచి ఓటరుగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేస్తోంది. ఈమేరకు కలెక్టరేట్‌కు మంగళవారం 27,427 ఓటరు గుర్తింపు కార్డులు చేరాయి. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఓటర్లుగా గుర్తించిన వారికి సంబంధించి కార్డులు జారీ అయ్యాయని అధికారులు తెలిపారు. వీటిని పోస్టల్ శాఖ ద్వారా ఓటర్లకు చేరవేయనున్నారు. ఇందులో ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించి 5,795, పాలేరుకు 8,245, మధిరకు 4,715, వైరాకు 3,903, సత్తుపల్లి నియోజకవర్గంలో ఓటర్లకు 4,769 గుర్తింపు కార్డులు అందించనున్నారు.

ఆర్‌ఓలు, ఏఆర్వోలకు శిక్షణ

జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎంపిక చేసిన ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శిక్షణ ఏర్పాటుచేయగా మాస్టర్ ట్రెయినర్లు వీరికి ఎన్నికల విధులు, నిర్వహణలో జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డీపీఓ ఆశాలత, డీఎల్‌పీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి దసరా బొనాంజా!

- ఖమ్మం రీజియన్‌కు రూ.24.22 కోట్ల ఆదాయం
- 6వ తేదీన అత్యధికంగా రూ.2.18 కోట్ల రాబడి
- అవిశ్రాంతంగా పనిచేసిన డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది





సత్తుపల్లి డిపోలో కండక్టర్‌కు కేక్ తినిపిస్తున్న డీఎం సునీత

ఖమ్మంమయూరిసెంటర్: దసరాపండుగ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌కు కనకవర్షం కురిపించింది. పండుగ రద్దీ ఆధారంగా ఆర్‌ఎం సరిరామ్ ఆధ్వర్యాన ముందస్తు ప్రణాళికలు రూపొందించడమే కాక సిబ్బంది నిర్విరామంగా పనిచేయడంతో రాకపోకలు సాఫీగా సాగాయి. ఫలితంగా రీజియన్‌కు రూ.24,22,58,199 ఆదాయం లభించింది.

1,208 ప్రత్యేక బస్సులు..

బతుకమ్మ, దసరా పండుగలకు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ప్రజలు స్వస్థలాలకు రానున్నందున ముందుగానే డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లతో ఖమ్మం రీజియన్ మేనేజర్ సరిరాం పలు దఫాలు సమీక్షించారు. ఈమేరకు ప్రత్యేక బస్సులు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. గతనెల 20 నుంచి ఈనెల 6వ తేదీ వరకు హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు, ఉమ్మడి జిల్లా నుంచి హైదరాబాద్‌కు బస్సులు నడిపారు. ప్రధానంగా హైదరాబాద్ నుంచి ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందుకు, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు వేలాది మందిని చేర్చేలా 1,208 ప్రత్యేక సర్వీసులు రాకపోకలు సాగించాయి.

38.50లక్షల కి.మీ. ప్రయాణం

గత నెల 20వ తేదీ నుంచి ఈనెల 6వరకు హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్‌కు, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు 38.50 లక్షల కి.మీ. బస్సులు తిరిగాయి. దీంతో ఆర్టీసీ రీజియన్‌కు మహాలక్ష్మితో కలిపి రూ.24.22 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.4.15 కోట్లకు పైగా ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు. కాగా, బతుకమ్మ, దసరా పండుగకు వచ్చివెళ్లే ప్రయాణికులకు సేవలందించేలా రీజియన్‌లోని ఏడు డిపోల డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, కార్మికులు, సూపర్‌వైజర్లు, డిపో మేనేజర్లు అవిశ్రాంతంగా పనిచేయడంతో ఎక్కడా లోటుపాట్లు ఎదురుకాలేదు.

ఒకేరోజు 3.17 లక్షల కిలోమీటర్లు

ఈ దసరా సెలవుల్లో ఖమ్మం రీజియన్ అధికారులు గత రికార్డులను బ్రేక్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ నెల 6వ తేదీ సోమవారం ఒకే రోజు 3.17 లక్షల కి.మీ. మేర బస్సులు తిరగగా రూ.2.18 కోట్ల ఆదాయం రాబట్టారు. ఇందులో రీజియన్‌లోని ఖమ్మం డిపోకు అత్యధికంగా రూ.49 లక్షలు ఆదాయం రాగా, భద్రాచలానికి రూ.38.39 లక్షలు, సత్తుపల్లికి రూ.37.95లక్షలు, మధిరకు రూ.32 లక్షలు, మణుగూరుకు రూ.21.50 లక్షలు, కొత్తగూడెంకు రూ.21.50 లక్షలు, ఇల్లెందుకు రూ.11 లక్షలు ఆదాయం సమకూరింది.

సత్తుపల్లి డిపోలో సంబురాలు

సత్తుపల్లిటౌన్: దసరా పండుగ సందర్భంగా సత్తుపల్లి డిపో నుంచి సోమవారం 104 సర్వీసులు నడిపించారు. హైదరాబాద్‌కు 25 రెగ్యులర్ సర్వీసులతో పాటు 22 అదనపు సర్వీసులు నడిపించగా మొత్తంగా 55,977 కి.మీ. బస్సులు తిరిగాయి. దీంతో 106 ఓఆర్, 67.80 ఈపీకేతో రూ.37,95,470 ఆదాయం సమకూరింది. ఈమేరకు మంగళవారం డిపోలో కండక్టర్లు, డ్రైవర్లు, ఉద్యోగులతో కలిసి డీఎం ఊటుకూరి సునీత కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ ఎస్.సాహితి, వీబీఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రీజియన్‌లో డిపోల వారీగా నమోదైన ఆదాయం
(సెప్టెంబర్ 20నుంచి ఈనెల 6వ తేదీ వరకు)

డిపో	ఆదాయం (రూ.కోట్లలో)
ఖమ్మం	5.53
మధిర	2.99
సత్తుపల్లి	4.41
భద్రాచలం	4.44
కొత్తగూడెం	2.47
మణుగూరు	3.25
ఇల్లెందు	1.12

ఆర్టీసీపై నమ్మకానికి నిదర్శనం



సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీని మించి మరేది లేదని ప్రయాణికులకు ఉన్న నమ్మకం మరోమారు రుజువైంది. అందుకే పండుగ సెలవుల్లో గమ్యస్థానాలకు చేరేందుకు ఎక్కువ మంది ఆర్టీసీనే ఆశ్రయించారు. ఇందుకు అనుగుణంగా మా సిబ్బంది శ్రమించారు. రానున్న రోజుల్లోనూ ఇదే తరహాలో సేవలందిస్తాం.
– ఏ.సరిరామ్, ఆర్‌ఎం, ఖమ్మం రీజియన్

భక్త శబరికి స్మృత్యంజలి

- గిరిజనుల ఆటపాటల నడుమ భద్రగిరి ప్రదక్షిణ
- రామయ్య కల్యాణంలో పాల్గొన్న గిరిజనులు



స్వామి వారికి ఫల, పుష్పాంజలి చేస్తున్న అర్చకులు



గిరిజన పెద్దలకు వస్త్రాలు అందజేస్తున్న పీఓ రాహుల్, ఈఓ దామోదర్‌రావు

భద్రాచలం: గిరిజనుల ఆటపాటలు, కొమ్ము నృత్యాలు, వారి సంస్కృతి, సంప్రదాయాల నడుమ భక్త శబరికి స్మృత్యంజలి ఘటించారు. భద్రాద్రి రామయ్యకు అపర భక్తురాలు, ప్రేమ, భక్తితో ఆయనకు ఎంగిలి పండ్లు సమర్పించిన శబరికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం శబరి స్మృతి యాత్ర వైభవోపేతంగా నిర్వహించారు. దేవస్థానంలో 2013 నుంచి ఏటా అశ్వయుజ మాసంలో పౌర్ణమి రోజున యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఫల, పుష్పాలతో నీరాజనం

యాత్ర నిర్వహణ కోసం వివిధ ప్రాంతాల గిరిజనులను బస్సుల్లో భద్రాచలం తీసుకొచ్చారు. మంగళవారం ఉదయమే శబరి చిత్రపటంతో మేళతాళాలు, భక్తుల శ్రీరామ నామస్మరణ నడుమ గిరిప్రదక్షిణ చేశారు. ఆతర్వాత చప్టా దిగువన తూము రామదాసు, భక్త రామదాసు విగ్రహాలకు ఆలయ ఈఓ కొల్లు దామోదర్‌రావు పూలమాలలు, శబరి విగ్రహం వద్ద పూలు, పండ్లు, వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజనుల సంప్రదాయ నృత్యాలు అలరించాయి. వీరితో పాటుగా ఈఓ దామోదర్‌రావు, ఇతర అధికారులు కొమ్ముపాగా ధరించి కాలు కదిపారు అనంతరం బేడా మండపంలో కొలువైన స్వామితో పాటు శబరికి గిరిజనులు పండ్లు, పూలను సమర్పించాక అర్చకులు పూజలు చేశారు. ఆపై చిత్రకూట మండపంలో స్వామివారి నిత్యకల్యాణం జరిపించగా గిరిజనులు కనులారా వీక్షించారు. కాగా, ఈ ఉత్సవంలో ఐటీడీఏ పీఓ బి.రాహుల్ పాల్గొని గిరిజన పెద్దలకు వస్త్రాలు, పూలు, పండ్లు అందజేసి సత్కరించారు. అలాగే, వాల్మీకి జయంతి కూడా నిర్వహించారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని వరరామచంద్రాపురంలో శబరి నది వద్ద దేవస్థానం అర్చకులు పూజలు చేశారు. నది ఒడ్డున శబరి విగ్రహానికి అభిషేకం నిర్వహించారు.

క్లుప్తంగా

అమెరికాలో వేమన శతకం బోధన



పుస్తకాలతో చిన్నారులు, సంస్థ బాధ్యులు

సత్తుపల్లిటౌన్: అమెరికాలోని తెలుగు కుటుంబాల్లో పిల్లలకు వేమన శతకపద్యాలు కూడా నేర్పుతున్నారు. డల్లాస్‌లోని కార్యసిద్ధి హనుమాన్ ఆలయంలో తెలుగు కుటుంబాల పిల్లలకు ప్రతీ ఆదివారం బాల రామాయణం, బాలభారతం వంటి పురాణాలతో పాటు మాతృభాష నేర్పిస్తుండగా సత్తుపల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు అయ్యదేవర శేషగిరిరావు - మాదిరాజు మాలతి దంపతులు ఇటీవల పరిశీలించారు. బోధన కోసం సృజన సాహితీ సమాఖ్య సమకూర్చిన వేమన శతకం పుస్తకాలతో పాటు ఊరిమెళ్ల సునంద రాసిన తెలుగు భాషా వాచకాలను శిక్షకురాలు దీప్తి శరణ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రకాష్ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ న్యాయవాదిగా ఉబ్బన రామకృష్ణ



రామకృష్ణకు ఉత్తర్వులు అందిస్తున్న ఆర్‌ఎం

ఖమ్మంలీగల్/కల్లూరు: జిల్లా కోర్టులో గత 27ఏళ్లుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న కల్లూరుకు చెందిన ఉబ్బన రామకృష్ణ ఖమ్మం ఆర్టీసీ రీజియన్ స్టాండింగ్ న్యాయవాదిగా నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం ఆయనకు ఆర్‌ఎం సరిరామ్ నియామక ఉత్తర్వులు అందించారు. కాగా, రామకృష్ణను న్యాయవాది నిరంజన్‌రెడ్డి, ఏపీపీ శరత్‌కుమార్ రెడ్డి, కల్లూరు వాసులు అభినందించారు.

పెన్షనర్లకు బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసుపాదం

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగ విరమణ చేసిన వారి బకాయిల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ఇకనైనా విడనాడి నెలకు రూ. వేయి కోట్ల చొప్పున కేటాయించాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి మేరి ఏసుపాదం డిమాండ్ చేశారు. ఖమ్మంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ చేసిన వారికి బకాయిలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈసమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్‌తో పాటు గుర్రాల శ్రీనివాసరావు, ఊడుగు వెంకటేశ్వర్లు, తాడి అంజలి, లక్ష్మీ సుజాత, అన్నమ్మ, ప్రసాదరావు, సుధాకర్, కృష్ణారావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

ఏఐ విజేతకు అభినందన



పల్లవిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఖమ్మంరూరల్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ప్రతిభ కనబరిచి ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న మండలంలోని ఆరెంపులకు చెందిన తాళ్లూరిపల్లవిని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ అభినందించారు. ఆరెంపులలోని ఆమె ఇంటికి మంగళవారం వచ్చిన ఆయన పల్లవిని సన్మానించి మాట్లాడారు. ఈతరం యువతకు పల్లవి విజయం స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. అలాగే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు ఫోన్‌లో పల్లవిని అభినందించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	5,650	2,800
ఏసీ మిర్చి	15,400	8,000
మిర్చి	8,100	5,000
కొత్త పత్తి	6,900	4,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400

'వసతి'కి తాళం..



ఖమ్మం రేవతిసెంటర్‌లోని కళాశాల బాలుర వసతిగృహం వంట గదికి వేసిన తాళం

తెరుచుకోని హాస్టళ్లు.. వెలగని పొయ్యి

- దసరా సెలవులు ముగిసినా అదే పరిస్థితి
- కార్మికుల సమ్మెతో గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో ఇక్కట్లు
- ఆశ్రమ పాఠశాలలకూ నామమాత్రంగానే విద్యార్థులు



వసతిగృహం గది బయట చెత్తాచెదారం

ఉమ్మడి జిల్లాలో వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాల

హాస్టల్	ఖమ్మం	భద్రాద్రి
పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలు	12	22
ప్రీ మెట్రిక్ వసతిగృహాలు	08	17
ఆశ్రమ పాఠశాలలు	10	86

ఖమ్మంమయూరిసెంటర్: వేతనాల సమస్యపై కొద్ది వారాలుగా కార్మికులు చేస్తున్న సమ్మెతో గిరిజన సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో వంట గదులు తెరుచుకోలేదు. దసరా సెలవుల కన్నా ముందే కార్మికులు సమ్మెలోకి దిగడంతో విద్యార్థులకు ఆహారం అందించడం సమస్యగా మారింది. సెలవులు ముగిసేలోగా పరిస్థితులు చక్కబడతాయని భావించినా ఆ పరిస్థితి లేక జిల్లాలోని పలు గిరిజన సంక్షేమ వసతిగృహాలు తెరుచుకోలేదు. ఈ విషయం తెలిసి ఆశ్రమ పాఠశాలలకు విద్యార్థులు కూడా అంతంతమాత్రంగానే వచ్చారు. వేతనాల తగ్గింపు జీఓను రద్దు చేయాలనే డిమాండ్‌తో సమ్మెకు దిగిన కార్మికులు సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదని చెబుతున్నారు. ఈ ప్రభావం విద్యార్థులపై పడుతుండగా.. అధికారులు కూడా సమస్య ప్రభుత్వం, కమిషనర్ స్థాయిలో ఉన్నందున తామేమీ చేయలేమని చెబుతుండడం గమనార్హం.

రెండు రోజులైనా అదే పరిస్థితి..

కార్మికుల సమ్మె కాలంలో దసరా సెలవులు రావడంతో అటు గిరిజన శాఖ అధికారులు, ఇటు వసతి గృహ సంక్షేమ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ, సెలవులు ముగిసినా సమ్మె విరమింపజేయక పోవడంతో గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో పొయ్యిలు వెలగడం లేదు. ప్రీమెట్రిక్ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలు ఈ నెల 4వ తేదీ శనివారం నుంచే తెరుచుకోవాల్సి ఉండగా సోమవారం నుంచి రావాలని విద్యార్థులకు సమాచారం ఇచ్చారు. కొన్ని ఆశ్రమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్ వసతి గృహాల అధికారులు మాత్రం తాము చెప్పేవరకు రావొద్దని సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇక పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలకు సంబంధించి కొన్ని వసతిగృహాలను మూసి ఉంచారు. ఖమ్మంలో ఏడు వసతిగృహాలు ఉండగా రెండు, మూడే తెరిచినట్లు తెలుస్తోంది.

బయటే టిఫిన్, భోజనం

రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమశాఖ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్, డెయిలీ వేజ్ కార్మికుల సమ్మెతో వసతిగృహాల్లో పనులు నిలిచిపోయాయి. చాలా వసతిగృహాల్లో ఇద్దరు,ముగ్గురు డెయిలీ వేజ్, ఔట్ సోర్సింగ్ కార్మి కులే ఉన్నారు. దీంతో చాలా వాటిని మూసి ఉంచ గా, కొన్నింటిని తెరిచినా వంట చేయడం లేదని తెలుస్తోంది. ఖమ్మం రేవతిసెంటర్‌లోని ఏటీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న గిరిజన సంక్షేమశాఖ ఖమ్మం రూరల్ కళాశాల బాలుర వసతిగృహంలో వంట గదితాళం తెరుచుకోలేదు. దీంతో వచ్చిన విద్యార్థులు టిఫిన్, భోజనం బయటే చేస్తున్నారు. ఏటీడీఓ కార్యాలయ ఆవరణలోని వసతిగృహం ఇలా ఉంటే మిగతా వాటి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

విద్యార్థులపై ప్రభావం

కార్మికుల సమ్మె ప్రభావం విద్యార్థులపై పడుతోంది. దసరా సెలవుల అనంతరం పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమైనా వసతిగృహాలు తెరుచుకోలేదు. దీంతో విద్యార్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. మారుమూల గ్రామాలకు చెందిన వారు ఖమ్మం కళాశాలల్లో చదువుతుండగా వీరికి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. కార్మికుల సమ్మెతో భోజనం సిద్ధం చేయించే పరిస్థితి లేక ఆశ్రమ పాఠశాలలకు రావొద్దని సమాచారం ఇచ్చినా త్వరలో జరగనున్న సమ్మెటివ్ పరీక్షల పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ఇకనైనా ప్రభుత్వం కార్మికుల సమస్యకు పరిష్కారం చూపాలని తల్లిదండ్రులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యను పరిష్కరించాలి..



కార్మికుల సమస్యను పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలి. కార్మికులు లేరనే సాకుతో కొన్ని వసతిగృహాలను తెరవకపోవడం సరి కాదు. సెలవులు ముగియగానే వసతిగృహాలను తెరిపించాల్సిన అధికారులు పట్టింపులేనట్లు వ్యవహరించడం గర్హనీయం. –ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి

వసతిగృహాల్లో వంట చేయించాలి..



వసతిగృహాలకు వస్తున్న విద్యార్థులకు భోజనం పెట్టడం లేదు. కార్మికులు లేరని వంట గదులు కూడా తెరవలేదు. అధికారులు వెంటనే కార్మికులను ఏర్పాటుచేసి విద్యార్థులకు భోజనం అందేలా చూడాలి. జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–వి.వెంకటేశ్, పీడీఎస్‌యూ, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి

కళ్ల ముందే సాగర తీరం!

సముద్రతీర ప్రాంతం లేని తెలంగాణలో కృత్రిమ బీచ్‌ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా హైదరాబాద్‌లోని కొత్వాల్‌గూడ దగ్గర రూ.225 కోట్లతో 35ఎకరాల్లో కృత్రిమ బీచ్ ఏర్పాటుకు సిద్ధమైంది. హైదరాబాద్ తరహాలోనే భద్రాద్రి జిల్లాలోనూ కృత్రిమ బీచ్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గోదావరి తీర ప్రాంతంలోని మణుగూరు మండలం పగిడేరు సమీపంలో ఉన్న వేడినీటి ఊటలు (ఉష్ణగుండాలు) కేంద్రంగా పర్యాటక అభివృద్ధికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందుకు జిల్లా యంత్రాంగం, సింగరేణి సంస్థ సహకారం అందించనున్నాయి. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

పగిడేరులో కృత్రిమ బీచ్ ఏర్పాటుకు సన్నాహాలు

- ఇక్కడ భూమి నుంచి సహజసిద్ధంగా ఉబికి వస్తున్న వేడినీరు
- ఈ నీటి ఆధారంగా బీచ్.. పర్యాటకంగా అభివృద్ధికి ప్లాన్
- సింగరేణి నుంచి సాంకేతిక, ఆర్థిక సహకారం



పగిడేరులో వేడినీరు ఉబికి వస్తున్న ప్రాంతం



ఇటీవల పగిడేరు వద్ద స్థానికులతో చర్చిస్తున్న కలెక్టర్ పాటిల్

ఉష్ణగుండాలు

హిమాలయ పర్వత శ్రేణుల్లో విస్తరించిన అనేక పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల దగ్గర ఉష్ణగుండాలు ఇటు పర్యాటకులను, అటు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని మణికరణ్, ఉత్తరాఖండ్‌లోని గౌరీకుండ్, తపోవన్ వంటి ప్రదేశాల్లో సహజసిద్ధంగా భూమిలో నుంచి వేడి నీరు బయటకు వస్తుంది. వీటిని పవిత్ర ప్రదేశాలుగా పరిగణిస్తూ అక్కడకు వెళ్లే భక్తులు స్నానాలు ఆచరిస్తారు. మెగ్నీషియం, సల్ఫర్, సోడియం, కాల్షియం వంటి ఖనిజాలను కలిగిన ఈ నీటిలో స్నానం చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని భక్తుల నమ్మిక. అలాగే, టైర్ వన్ సిటీల్లో కొత్తగా వెలుస్తున్న వెల్‌నెస్ సెంటర్లలోనూ 'హాట్ వాటర్ థెరపీ'లు అందుబాటులో ఉన్నాయి.

కృత్రిమ బీచ్ ఏర్పాటుతో..

పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం టూరిజం పాలసీని ప్రకటించింది. అందులో భాగంగానే తెలంగాణలో కృత్రిమ బీచ్‌ల ఏర్పాటుకు నిర్ణయించారు. పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండే హైదరాబాద్‌లో ఆర్టిఫీషియల్ బీచ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా ఇప్పుడు వేడి నీటి ఊటల ఆధారంగా పగిడేరులోనూ బీచ్ ఏర్పాటుకు పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉబికి వచ్చే వేడి నీటిని సమీప ప్రాంత రైతులు నేరుగా ఉపయోగించడం లేదు. మడుల్లో నిల్వ చేసి చల్లారాక పొలాలకు పారిస్తున్నారు. ఇలాంటి మడుల దగ్గరే ఇసుక రాశులను భారీగా పోయడం ద్వారా కృత్రిమ బీచ్ ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది.

సింగరేణి సహకారం

భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఉండడంతో జిల్లాలో టెంపుల్ టూరిజం ఉన్నత స్థాయిలో ఉంది. ఏపీలోని పాపికొండలు, మారేడుమిల్లికి వెళ్లే పర్యాటకులు జిల్లా మీదుగానే రాకపోకలు సాగిస్తారు. ఇక పాల్వంచ మండలం కిన్నెరసాని వద్ద కూడా ఏకో టూరిజం అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఇలా జిల్లాకు వచ్చే పర్యాటకులకు మరో ఆకర్షణగా ఈ కృత్రిమ వేడి నీటి బీచ్‌ను అందుబాటులోకి తీసుకురావాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మేరకు రెవెన్యూ సంబంధిత వ్యవహారాలు జిల్లా యంత్రాంగం చూసుకోనుండగా, ఇక్కడ జియో థర్మల్ పవర్ ప్లాంట్ పైలట్ ప్రాజెక్టు చేపడుతున్న సింగరేణి ఈ ప్రదేశాన్ని బీచ్‌గా మార్చేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహకారం అందించనుంది. బొగ్గుతో మొదలైన సింగరేణి ప్రస్థానం థర్మల్, సోలార్ పవర్‌లోనూ తన సత్తా చాటుతోంది. తాజాగా రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌తో పాటు పర్యాటక రంగంలోనూ పాదం మోపనుంది. ఇప్పుడు కృత్రిమ బీచ్ ఏర్పాటు ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే సింగరేణి మరో అడుగు ముందుకేసినట్లవుతుంది.

సహజసిద్ధంగా వేడినీరు

గోదావరి తీర ప్రాంతంలో చమురు నిక్షేపాల కోసం 70, 80వ దశకంలో ఆయిల్, నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) అన్వేషణ సాగించింది. ఈక్రమాన అనేక చోట్ల బోర్లు వేయగా మణుగూరు మండలం పగిడేరు వద్ద వేసిన ఓ బోరు నుంచి నిత్యం వేడి నీరు బయటకు వస్తోంది. ఆర్టిసన్ వెల్స్‌గా వీటిని పిలుస్తారు. భూమి లోపలి పొరల్లో ఉండే నీరు విపరీతమైన వేగంతో బండరాళ్ల గుండా ప్రవహించినప్పుడు ఏర్పడే రాపిడితో నీరు వేడెక్కుతుంది. పగిడేరు వద్ద ఉబికి వచ్చే నీరు 70 – 80 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉంటుంది. ఇక్కడ వేడినీటి ఊటల ఆధారంగా 20 కిలోవాట్ల సామర్థ్యంతో జియో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సింగరేణి ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు చేపట్టింది. ఈ మేరకు ఇక్కడ గత రెండేళ్లుగా ప్రయోగాలు జరుగుతున్నాయి.

ఆర్చరీ, కబడ్డీ, రెజ్లింగ్ జట్ల ఎంపిక



ఉమ్మడి జిల్లా బాలికల కబడ్డీ జట్టుతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన వివిధ క్రీడల ఉమ్మడి జిల్లా స్థాయి జట్ల ఎంపికకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మంగళవారం పోటీలు నిర్వహించారు. కబడ్డీ జట్ల ఎంపికకు 110 మంది బాలబాలికలు, ఆర్చరీ జట్ల ఎంపికకు 20 మంది, రెజ్లింగ్ ఎంపికకు 25 మంది హాజరయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న జట్ల ఎంపిక పోటీలను కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబు, ఖేలో ఇండియా ఖమ్మం సెంటర్ కోచ్ నగేశ్, క్రీడా సంఘం కార్యదర్శి ఎండీ మూసీకలీం పర్యవేక్షించారు.

- జిల్లా బాలుర కబడ్డీ జట్టులో బి.కౌశిక్, జి.వినయ్, పి.మనోహర్, వి.సాయికిరణ్, ఐ.కుమార్, ఆర్.రాకేశ్, జి.గణేశ్, కె.భార్గవ్‌రెడ్డి, ఈ.అజయ్ కుమార్, బి.మధు, డి.సాయికిరణ్, సాయికృష్ణ, వి.వివేక్, ఎల్.అరవింద్, బి.శరత్, డి.ధనుష్, డి.ఆనంద్‌కిశోర్ స్థానం దక్కించుకున్నారు.
- బాలికల కబడ్డీ జట్టుకు జి.మైత్రీ, బి.కుసుమ, బి.పల్లవి, ఎస్‌కే వాదాహసీనా, ఎస్.పల్లవి, జి.సాహితి, జి.హరిణి, టి.వినీల, ఎస్.భావ్యశ్రీ, కె.ప్రత్యూష, ఎస్‌కే రిజ్వాన, ఆర్.శ్రీలత, జి.యశస్విని, స్నేహ, కె.ఇందు, ఎండీ ఆసియా, ఎల్.మిత్ర, కె.సోమక్క ఎంపికయ్యారు.
- జిల్లా ఆర్చరీ బాలుర జట్టులో ముల్కి చరణ్, ఆర్.బార్గవ్, బి.హరికృష్ణ, ఎ.కొండల్‌రాయ్, బాలికల జట్టులో టి.వీరభద్రమ్మ, కుంజ భవ్యకు స్థానం దక్కింది.
- రెజ్లింగ్ బాలుర జట్టులో ఎ.విష్ణువర్ధన్, జి.యువరాజ్, ఎన్.వివేక్‌వర్ధన్, బి.మణిచరణ్, పి.శివతేజ్ నందన్, పి.జయదేవ్, పి.గణేశ్, వి.ఉదయ్‌కిరణ్, కె.లిఖిత్ చరణ్, ఎం.అమేశ్ బహాదుర్, ఎస్.చరణ్ రాజ్, బాలికల జట్టులో జి.వర్షిత, కె.దీక్షిత, ఆర్.గీత హర్షిణి స్థానం దక్కించుకున్నారు.

అండర్–19 బాలికల ఫుట్‌బాల్ జట్టు

ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక పోటీలు మంగళవారం ఖమ్మంలోని మున్సిపల్ పార్క్‌లో జరిగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 40 మంది క్రీడాకారిణులు పాల్గొనగా, ఎంపిక ప్రక్రియను ఫుట్‌బాల్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్, క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసా కలీం పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎం.కిరణ్మయి, జి.ఆశా, బి.వైష్ణవి, టి.స్వాతి, ఎం.రూప, బి.కావ్య, కె.సాత్వి, ఎం.సృజన, ఎం.నవ్యశ్రీ, ఎం.నక్షత్ర, ఎం.యువ వర్షిణి, ఎస్.కే.నసీమా, బి.హాసిని, కె.నందిని, బి.ప్రవళిక, కె.తేజశ్రీ, వర్షిత, భావన ఎంపికయ్యారని వెల్లడించారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రెయినీ అధికారి



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న సాయిశ్రీజ

ఖమ్మంమయూరిసెంటర్:ఇటీవల ప్రకటించిన గ్రూప్ -1 ఫలితాల్లో బీసీసంక్షేమ అధికారిగా ఎంపికైన సాయి శ్రీజను రాజన్న సిరిసిల్ల జిల్లాలో నియమించారు. ఆపై ఆమెను శిక్షణ నిమిత్తం ఖమ్మం జిల్లాకు కేటాయించడంతో ఇక్కడకు వచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.

ట్రెక్కింగ్ పోటీల్లో ప్రతిభ

మణుగూరుటౌన్: ఆల్ ఇండియా ట్రెక్కింగ్ పోటీల్లో మణుగూరు సింగరేణి విద్యార్థులు ప్రతిభ చూపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు హెచ్‌ఎం కల్యాణి ఎన్‌సీసీ ధ్రువపత్రాలను అందజేసి మాట్లాడారు. గత నెల 25 నుంచి ఈనెల 2వరకు తిరుపతిలో ఎన్‌సీసీ 8వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రెక్కింగ్ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 102 మంది పాల్గొన్నారని చెప్పారు. ఇందులో మణుగూరు సింగరేణి హైస్కూల్ నుంచి 8మంది ప్రతిభ చూపారన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల కోచ్, ఏఎన్‌ఓ కె.రాజసింహ, ఉపాధ్యాయుడు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

డీఎంహెచ్ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో ఫైలేరియా వ్యాధి సంపూర్ణ నిర్మూలనకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్ఓ కళావతిబాయి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సర్వేపై ఉద్యోగులకు శిక్షణ ఇవ్వగా ఆమె మాట్లాడారు. ఫైలేరియా నిర్మూలనలో సర్వే కీలకమైనందున వ్యాధి వ్యాప్తి ఆగిందా, లేదా అనేది నిర్ధారించాలని తెలిపారు. ఆపై సర్వే విధానం, శాంపిళ్ల పరిశీలన, వివరాల నమోదుపై అదనపు డీఎంహెచ్ఓ వెంకటరమణ అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ చందునాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కామేపల్లి : శిబిరంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కళావతిబాయి

కామేపల్లి: ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ కళావతిబాయి తెలిపారు. కామేపల్లి మండలం మద్దులపల్లిలో భద్రాచలం ఐటీడీఏ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. గ్రామీణుల చెంతనే వైద్యం అందించేలా శిబిరాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ 400 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. భద్రాచలం ఐటీడీఏ అడిషినల్ డీఎంహెచ్ఓ సైదులు, వైద్యులు, ఉద్యోగులు నెల్లూరి చందన, శిరీష, ప్రసన్న జ్యోతి, అమీనాజ్, నిరోష, రాజశేఖర్, అభిలాష్ రెడ్డి, జైకీర్తి, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, నరేంద్రనాయక్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రతీ గడపకు బీజేపీ నినాదం



పార్టీ నాయకులతో జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులతో పాటు పార్టీ విధానాలను గడపగడపకు తీసుకెళ్లాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు సూచించారు. ఖమ్మంలోని జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన నూతన జిల్లా కార్యవర్గంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ఎక్కడుంది అని ప్రశ్నించే వారికి సమాధానాలు చెప్పేలా పార్టీ విధానాలను ప్రజల్లో తీసుకెళ్లాలని, తద్వారా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని చెప్పారు. గ్రామస్థాయి మొదలు పట్టణాల వరకు ప్రతీ ఓటరుతో నేరుగా సంబంధం పెట్టుకుని వారి సమస్యల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. అలాగే, ఆరు గ్యారంటీల పేరుతో ఇచ్చిన హామీలను రాష్ట్రప్రభుత్వం విస్మరించిన విషయాన్ని వివరించాలని తెలిపారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ స్థానం నుంచి బీజేపీ పోటీ చేయనుండగా అర్హులకు అవకాశం కల్పిస్తామని కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు మందడపు సుబ్బారావు, గుత్తా వెంకటేశ్వరరావు, నాయుడు రాఘవరావు, నలగట్టు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ విధివిధానాలపై సమీక్ష

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపుకార్యదర్శి రూపేందర్ న్యూఢిల్లీ నుంచి మంగళవారం కోల్ ఇండియా పరిధి బొగ్గు సంస్థలు, మైనింగ్ కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) విధివిధానాలపై సమీక్ష నిర్వహించారు. ఈ వీసీలో సింగరేణి సంస్థ తరఫున హైదరాబాద్ సింగరేణిభవన్ నుండి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు, కొత్తగూడెం కార్యాలయం నుండి జీఎం(పర్సనల్) వెల్ఫేర్- సీఎస్ఆర్ జీ.వీ.కిరణ్‌కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా బొగ్గురంగంలో సీఎస్ఆర్ నిధుల కేటాయింపు, వినియోగంపై చర్చించి సూచనలు చేశారు. సమావేశంలో సింగరేణి అధికారులు గట్టు స్వామి, గౌస్‌పాషా, రవికిశోర్ పాల్గొన్నారు.

రైలు నుండి జారిపడి తమిళనాడు వాసి మృతి



మృతదేహాన్ని మోసుకొస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

ఖమ్మంక్రైం: రైలులో ప్రయాణిస్తున్న తమిళనాడుకు చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. చెన్నైకి చెందిన గోపీనాథ్ (41) బ్రతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి కూలీ పని చేస్తున్నాడు. కుటుంబీకులను చూడడానికి సోమవారం రాత్రి చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో బయలు దేరగా, ఖమ్మం పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వెనకభాగంలో ప్రమాదవశాత్తు జారి పడగా తీవ్రగాయాలతో మృతిచెందాడు. మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా ఆయన వివరాలను గుర్తించిన జీఆర్పీ పోలీసులు కుటుంబానికి సమాచారం ఇచ్చారు.

రెండు కిలోమీటర్లు మృతదేహంతో..

రైలు పట్టాల వెంట గోపీనాథ్ మృతదేహాన్ని గుర్తించిన జీఆర్పీ పోలీసులు అక్కడి నుంచి మెయిన్‌రోడ్‌కు తీసుకురావానికి అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారం కోరారు. దీంతో ఆయన తన బృందంతో చేరుకుని మృతదేహాన్ని కర్రకు కట్టుకుని రెండు కి.మీ. నడుస్తూ వచ్చి వాహనంలో జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

పార్ట్‌టైం ఉద్యోగాల పేరిట రూ.1.57 లక్షలు స్వాహా

ఖమ్మంఅర్బన్: పార్ట్ టైం ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఖమ్మంలో ఇద్దరిని మోసం చేసిన ఘటన వెలుగు చూసింది. ఖమ్మం యూపీహెచ్ కాలనీకి చెందిన కె.అన్వేష్ టెలిగ్రామ్ యాప్‌లో పార్ట్ టైం జాబ్ చేయండి, డబ్బు సంపాదించండి అంటూ వచ్చిన ప్రకటనకు స్పందించాడు. దీంతో ఆయనకు ఫోన్ చేసిన సైబర్ మోసగాళ్లు దఫాలుగా రూ.1.29 లక్షలు కాజేసి ముఖం చాటేశారు. అలాగే, ధంసలాపురం కొత్తూరుకు చెందిన యువతికి కూడాఇలాంటి ప్రకటననే నమ్మి సెప్టెంబర్ 19న రూ.28 వేలు కోల్పోయింది. బాధితుల ఫిర్యాదుతో మంగళవారం కేసులు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

బోనకల్: ట్రాక్టర్ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బోనకల్ మండలం బోనకల్–ముష్టికుంట్ల మధ్య ఎన్నెస్పీ కాల్వ సమీపాన మంగళవారం ఈ ప్రమాదంజరిగింది. ముష్టికుంట్లకు చెందిన దోసపాటిశ్రీధర్, బోయిన కొండలు బోనకల్ నుండి కిరాణా సరుకులు తీసుకుని ద్విచక్ర వాహనంపై ముష్టికుంట్ల వస్తున్నారు. ఈక్రమాన బోనకల్ నుంచి ముష్టికుంట్ల విద్యుత్ స్తంభాలకు గుంతలు తవ్వేందుకు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీధర్, కొండలుకు తీవ్ర గాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వెంకన్న తెలిపారు.